హరిభూషణ్ వారసుడిగా 'బడే'



- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా చొక్కారావు అలియాస్ దామోదర్
- రెండున్నర సంవత్సరాలకు పార్టీకి కార్యదర్శి నియామకం
- ములుగు జిల్లా కాల్వపల్లి వాసి దామోదర్
- ఉత్తర తెలంగాణలో పూర్తి స్థాయిలో పట్టు
- చిన్నతనంలోనే విప్లవ బాట పట్టిన ఆదివాసీ బిడ్డ

భూపాలపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ రెండున్నరేళ్ల తర్వాత నూతన కార్యదర్శిని నియమించింది. 2021 జూన్ 21న కరోనాతో అప్పటి కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మృతి చెందారు. అప్పటి నుంచి ఈ పదవిలో ఎవరూ లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తున్న మావోయిస్టు పార్టీ ఎట్టకేలకు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ను నూతన కార్యదర్శిగా నియమించింది. రాష్ట్ర యాక్షన్ టీం కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న దామోదర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించటంతో తెలంగాణలో మళ్లీ మావోయిస్టులు ఉద్యమాన్ని బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నట్టు భావిస్తున్నారు.

రెండున్నరేళ్లుగా కార్యదర్శి కోసం...

యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మృతి తర్వాత మావోయిస్టు పార్టీ పగ్గాలు చేపట్టే నేత కోసం అగ్రనేతలు పలువురి పేర్లను పరిశీలిస్తూ వస్తున్నారు. వీరిలో ప్రధానంగా మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, యాక్షన్ టీం రాష్ట్ర కార్యదర్శి, ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, పశ్చిమ గోదావరి జిల్లాల బాధ్యుడు, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, ఏవోబీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు, భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్, కుమరంభీం ఆసిఫాబాద్ - మంచిర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి మైలారపు అడేళ్ల అలియాస్ భాస్కర్, బండి ప్రకాశ్ అలియాస్ బండి దాదా, జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ పేర్లను కేంద్ర కమిటీ పరిశీలించింది. అయితే రెండునరేళ్లుగా ఎవరికీ బాధ్యతలు ఇవ్వకుండా హోల్డ్‌లో పెట్టింది. దీంతో తెలంగాణలో ఉద్యమం విస్తరించటం లేదని భావించిన కేంద్ర నాయకత్వం కార్యదర్శి ఎంపికపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు నేతృత్వంలో కేంద్ర కమిటీలోని కీలక నేతలు చర్చలు జరిపి మావోయిస్టు తెలంగాణ కార్యదర్శి నియామకం చేసినట్టు సమాచారం.





బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (ఫైల్)

దామోదర్ వైపే మొగ్గు..

హరిభూషణ్ వారసత్వాన్ని కొనసాగించేందుకు, ఉద్యమానికి బలం ఉన్న ఉత్తర తెలంగాణలో గట్టి పట్టున్న తెలంగాణ యాక్షన్ టీం కమాండర్‌గా ఉన్న బడె చొక్కారావు అలియాస్ దామోదర్ వైపు మావోయిస్టు కేంద్ర కమిటీ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. 1993లో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపులో దామోదర్ ఏటూరునాగారం దళ సభ్యుడిగా చేరారు. ఆ తర్వాత ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్నారు. తెలంగాణలో జిల్లాల పునర్విభజన జరగక ముందు కరీంనగర్, ఖమ్మం, వరంగల్(కేకేడబ్ల్యూ) డివిజన్ కమిటీ కార్యదర్శిగా దామోదర్ పని చేశారు. అనంతరం 2016-17లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్‌ను ఏర్పాటు చేసి, దానికి కార్యదర్శిగా కూడా దామోదర్ పనిచేశారు. 2019లో జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి బాధ్యతల నుంచి పార్టీ తప్పించి రాష్ట్ర కమిటీలోకి తీసుకుంది. రాష్ట్ర యాక్షన్ టీమ్ కమిటీ కమాం డ ర్‌గా పదోన్నతితో నియమించింది. ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో దామోదర్‌కు గట్టి పట్టుండటంతో పాటు పార్టీతో రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉంది. దీంతో ఆయన వైపే పార్టీ కేంద్ర నాయకత్వం మొగ్గు చూపినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. దామోదర్‌పై సుమా రు 75కి పైగా కేసులు ఉన్నాయి. ప్రభుత్వం దామోదర్‌పై రూ.25 లక్షల రివార్డు కూడా ప్రకటించింది.

కాల్వపల్లి ఆదివాసీ బిడ్డ

బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ది ములుగు జిల్లా తాడ్వా యి మండలం కాల్వపల్లి. ఆయన సోదరుడు బడే నాగేశ్వర్‌రావు కూడా మావోయిస్టు పార్టీలో కీలక నేతగా వ్యవహరించారు. 2008లో బడే నాగేశ్వర్‌రావు దంపతులు తాడ్వాయి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. సోదరుడు నాగేశ్వర్‌రావు అడుగు జాడల్లోనే విప్లవ బాటలో దామోదర్ నడిచారు. 1993లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరిన దామోదర్ ఏటూరునాగారం ఏరియా కమిటీలో చేశారు. ఏటూరునాగారం ఎస్టీ హాస్టల్‌లో పదో తరగతి వరకు చొక్కారావు చదువుకున్నారు. ఈ ప్రాంతంపై దామోదర్ గట్టి పట్టు సాధించారు. మూడుదశాబ్దాలుగా పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, యాక్షన్ టీం కమాండర్‌గా వ్యవహరించారు. తాజాగా రాష్ట్ర కార్యదర్శిగా దామోదర్‌కు మావోయిస్టు బాధ్యతలు రావటంతో ఓరుగల్లుకు చెందిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ వారసత్వాన్ని మరోసారి ఓరుగల్లు ఆదివాసీకి పార్టీ అప్పగించిందనే ప్రచారం జరుగుతోంది.

ఓరుగల్లు పోలీసుల అలర్ట్

మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శిగా కాల్వపల్లికి చెందిన దామోదర్‌కు బాధ్యతలు అప్పగించటంతో ఓరుగల్లు పోలీసులు అప్రమత్తమయ్యారు. నాలుగురోజుల కిందటే దామోదర్ బాధ్యతలు తీసుకోవటంతో భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ కమిషనరేట్ పోలీసులు అలర్ట్ అయ్యారు. గోదావరి తీర ప్రాంతంపై పోలీసులు నజర్ పెట్టారు. మాజీల కదలికలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. దామోదర్‌కు ఉమ్మడి వరంగల్‌పై పట్టు ఉండటంతో రిక్రూట్‌మెంట్‌పై దృష్టి పెట్టొచ్చని భావిస్తున్న పోలీసులు నిఘా మరింత పెంచారు. మొత్తానికి దామోదర్ నియామకంతో మావోయిస్టు కార్యకలాపాలకు చెక్ పెట్టడం ఓరుగల్లు పోలీసులకు సవాల్‌గా మారనుందనే టాక్ వినిపిస్తోంది.

బిల్ట్ పునరుద్ధరణకు ముందడుగు

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐటీసీ ప్రతినిధులు

ఫ్యాక్టరీకి సంబంధించిన రికార్డుల పరిశీలన



ములుగులో కలెక్టర్ ఇలా త్రిపాఠితో సమావేశమైన ఐటీసీ కంపెనీ ప్రతినిధులు

ములుగు, జనవరి 12 : ములుగు జిల్లాలోని మంగపేట మండలం కమలాపురంలో గల బిల్ట్ కర్మాగారం పునరుద్ధరణకు అడుగు ముందుకు పడింది. పదేళ్ల క్రితం మూతపడ్డ ఈ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించే ఉద్దేశంతో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ కంపెనీ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. బిల్ట్‌ను పునరుద్ధరించేందుకు ఐటీసీ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆసంస్థ ప్రతినిధుల బృందం ములుగులోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసింది. ఫైనాన్స్ జీఎం అవినాష్‌జౌరి, లీగల్ జీఎం అమిత్‌కుమార్, డిప్యూటీ జీఎం డాక్టర్ ఉషారాణి, లీగల్ ప్రతినిధి ఆకాష్‌జైన్‌లతో కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తులు, రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లను పరిశీలించారు. ఈ భేటీలో ఐటీసీ బృందం బిల్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తదుపరి కార్యాచరణను ప్రారంభిస్తామని తెలిపింది. ఈ పరిణామంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సీఎంతో సమీక్ష జరిగిన కొద్ది రోజులకే ఐటీసీ యాజమాన్యం క్షేత్ర స్థాయి పరిశీలన కోసం తమ బృందాన్ని పంపించడంతో బిల్ట్ పునరుద్ధరణ ప్రక్రియ పట్టాలెక్కినట్లేనని పలువురు భావిస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 12: దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దళితబంధు లబ్ధిదారులు శుక్రవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. నిలిచిన దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత లబ్ధిదారులకు చెందిన దళితబంధు డబ్బులు కలెక్టర్ అకౌంట్‌లో ఉన్నందున వెంటనే వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లబ్ధిదారులకు నిధులను విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారులు రాజయ్య, మధుకర్, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్

మేడారంలో పలు అభివృద్ధి పనుల పరిశీలన



బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను పరిశీలిస్తున్న పీవో అంకిత్, ఓఎస్డీ

మేడారం, జనవరి 12: మహా జాతర నేపథ్యంలో మేడారంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం వారు పరిశీలించారు. జంపన్న వాగు వద్ద స్నానఘట్టాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలాలు, చిలకల గుట్ట వద్ద చేపట్టిన పనులను, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. భక్తులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ నివేదికలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు అజయ్‌కుమార్, సుభాష్, సతీష్, సదయ్య, సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియా భవనం కోసం స్థల పరిశీలన

మేడారం : తాడ్వాయి మండలం మేడారం మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరుగనున్న నేపథ్యంలో మీడియా లైవ్‌ల కోసం మీడియా పాయింట్ ఏర్పాటునకు ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రస్తుత మీడియా పాయింట్ రద్దీగా మారుతుండడంతో పక్కనే గద్దెల ప్రాకారం అంచున మరో భవనం నిర్మించనున్నారు. ఈ క్రమంలో ఈ భవనానికి మరో పక్క పూజారుల రహస్య పూజా మందిరం ఉంది. దీంతో పూజారులు పలు అభ్యంతరాలు తెలుపుతున్నారు. అందుకు మరో స్థలాన్ని పరిశీంచడం జరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

30 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

సందడిగా మారిన మేడారం పరిసరాలు

మేడారం, జనవరి 12 : తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం భారీగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ దేవతల మహా జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 30 వేలకు పైగా భక్తులు మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు.



మేడారంలో భక్తులతో రద్దీగా మారిన గద్దెల ప్రాంగణం



వనదేవతల గద్దెలకు పూజలు చేస్తున్న భక్తులు

వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాల్స్

హనుమకొండ అర్బన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ బి.త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది కళాశాలలకు 2024-25 అకడమిక్‌కు ఈ నియామకాలు చేపట్టారు. హనుమకొండ కేఎంసీలోని జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఎంసీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.భిక్షపతిరావును నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.



డాక్టర్ రాజేంద్రప్రసాద్



డాక్టర్ భిక్షపతిరావు

కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం

అటవీశాఖ ఆధ్వర్యంలో చెత్త ఏరివేత

వివరాలు 8వ పేజీలో

పోదాం పద జాతర..



చలువ పందిళ్లతో మల్లికార్జునస్వామి దేవస్థానం

ముస్తాబైన ఐనవోలు

నేడు ధ్వజారోహణం.. రేపు భోగి..

మల్లన్న చెంతకు పోటెత్తనున్న భక్తులు

ఐనవోలు, జనవరి 12 : ఐనవోలు జాతరకు ముస్తాబైంది. ఈ నెల 13న శనివారం ధ్వజారోహణంతో జాతర ఉత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుండటం ఈ ఆలయ విశిష్టత. 14న భోగి, 15 మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు జాతర నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పించారు. ఎట్టకేలకు జాతరలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. భక్తులు స్నానా లు చేసేందుకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను 6 చోట్ల ఏర్పాటు చేశారు. మహిళలు స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు 7 చోట్ల డ్రెస్సింగ్ రూం లను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఉన్న మూడు చోట్ల మరుగుదొడ్లను సులభ్ కాంప్లెక్స్‌కు అప్పగించారు. జాతరలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. జీడబ్ల్యూఎంసీ, పంచాయతీరాజ్ శాఖ దేవస్థానం నుంచి 300 మంది కార్మికులు పారిశుధ్య నిర్వహణను చేపట్టనున్నారు.



పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్..


పోలీసులు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. జాతర పార్కింగ్ స్థలాలను ఖరారు చేసి రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. 10 చెక్‌పోస్టులు, 150 సీసీ కెమెరాలు, ప్రత్యేక గస్తీ, నిఘా బృందం, షీటీంలు పని చేయనున్నాయి. డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. మామునూరు ఏసీపీ సతీష్ బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై జి.అనిల్‌కుమార్‌ల నేతృత్వంలో సుమారు 400 పైచిలుకు మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు

హనుమకొండ డిపోకు చెందిన సుమారు 130 బస్సుల ద్వారా జాతరకు భక్తులను చేర్చనున్నారు. వరంగల్ నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఐనవోలుకు బయలుదేరుతుంది. ఐనవోలు-కాజీపేట-కొమురవెల్లి- వేములవాడలకు భక్తులు వెళ్లే విధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని ఆర్ఎం లలిత తెలిపారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఈవో



జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రధానంగా నీరు, పారిశుద్ధ్యం, కరెంట్‌పై దృష్టి పెట్టి ఏర్పాట్లు చేశాం. దేవాదాయ శాఖ ఏర్పాట్లకు అదనంగా ఖర్చుచేసింది. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేస్తాం.

విద్యార్థుల సృజనకు పదును

- ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు
- ఈ నెల 18 వరకు ప్రాజెక్టుల అప్‌లోడ్
- హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టుల ఎంపిక



ఇన్‌స్పైర్ మనక్ లోగో

హనుమకొండ రూరల్, జనవరి 12: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. వారిని ప్రయోగాల వైపు మళ్లించి భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 10 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. ప్రధానమంత్రి కలల ప్రాజెక్టు స్టార్టప్ ఇండియా దిశగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రయోగాలు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనల దిశగా 2022-23 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల తయారీ కోసం ప్రతి విద్యార్థికి రూ.10వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల ప్రదర్శన ఈసారి ఆన్‌లైన్ వేదికగా నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు

ఆన్‌లైన్ ప్రత్యేక యాప్ ద్వారా ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూల్యాంకనం చేసి 26న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకనం చేసిన అనంతరం జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే వి ద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్‌లోడ్ ఇలా..

ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థి రిజిస్ట్రేషన్, ఓటీపీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. విద్యార్థి పేరు, పాఠశాల పేరు, ప్రాజెక్టు విషయాలు కనిపించగానే వాటిని ఒకసారి సరిచూసుకొని ముందుకు వెళ్లాలి. ఆ తర్వాత అప్‌లోడ్ చేసి ప్రాజెక్టుకు సంబంధించిన వీడియో, ఆడియో, ఫొటోలను నమోదు చేయాలి. వీడియో 2 నిమిషాలు ఉండి 30 ఎంబీ దాటకూడదు. ఫొటోలు నాలుగు వరకే నమోదు చేయాలి. దీంతోపాటు వాయిస్ రికార్డులో ప్రయోగ వివరణ ఇవ్వాలి. వివరాలు అన్ని సరిచూసుకొని సబ్మిట్ ఎంట్ చేయాలి.

అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్ పోటీలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రాజెక్టుల అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పోటీల సూచనలను చక్కగా చదువుకొని అర్థం చేసుకొని అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. సందేహాల నివృత్తి కోసం 9490112848 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



అబ్దుల్‌హై, డీఈవో

విద్యార్థులను పాఠశాలల స్థాయిలోనే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టాలి. ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంవల్ల భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుంది. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులతో ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేయించడానికి గైడ్ టీచర్లు కృషి చేయాలి.

ఉజ్వల భవిష్యత్‌కు 'నవోదయం'



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి విద్య

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం
- ఈనెల 20న ప్రవేశ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు

జఫర్‌గఢ్, జనవరి 12: అ త్యున్నత ప్రమాణాలతో కూడిన ఆ ధునిక విద్యనందిస్తూ విద్యార్థులను ఉత్త మ విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దుతూ మన్ననలు అందుకుంటోంది ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఇందులో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థికి ఇంటర్ మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యనందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, విద్యార్థులు

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాలో పరీక్ష కేంద్రాలు, ప్రవేశ పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థుల వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ వెల్లడించారు. జనగామ జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 674 మంది, మహబూబాబాద్ జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,162 మంది. ములుగు జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 521 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 238 మంది, వరంగల్ జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 2,082 మంది, హన్మకొండ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాల్లో 837 మంది. సిద్దిపేట జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 124 మంది చొప్పున మొత్తం 26 పరీక్ష కేంద్రాల్లో, 5,638 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

ప్రవేశ పరీక్ష విధానం

ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేటలో ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. మొత్తం రెండు గంటల వ్యవధిలో 100 మార్కులకు.. మూడు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మేధాశక్తి పరీక్షలో 50 మార్కులతో కూడిన 50 ప్రశ్నలు (60 నిమిషాల సమయం), గణితం విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం), భాషా విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం) చొప్పున ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాలు ఐసీఆర్/ఓసీఆర్ షీట్లలో అంకెల రూపంలో గుర్తించాలి. నెగెటివ్ మార్కులు ఉండవు.

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు

పరీక్షలు రాసేవారందరూ చిన్నారులే కావడంతో ఓసీఆర్ షీట్లలో సమాధానాలు గుర్తించాల్సి ఉండడంతో తడబాటు ఉంటుంది. అది పోవాలంటే కింది అంశాలను గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- సమాధానాలు గుర్తించడానికి నీలి లేదా నలుపు (బ్లూ, బ్లాక్) బాల్ పెన్ను మాత్రమే వినియోగించాలి.
- ఒక్కసారి సమాధానం రాసిన తరువాత మార్చుట, కొట్టివేయుట, దిద్దడం చేయకూడదు.
- ఒక ప్రశ్నకు సుమారు ఒక నిమిషం పడుతుంది. అందువల్ల ఒక్క ప్రశ్న గురించి ఎక్కువ సమయం తీసుకోకూడదు. దానిని వదిలి మరో ప్రశ్నకు జవాబు రాసే ప్రయత్నం చేయాలి. దీని వల్ల సమయం ఆదా తగ్గుతుంది. అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించాక.. నెగిటివ్ మార్కులు ఉండవు కాబట్టి వదిలివేసిన ప్రశ్నలుంటే అపుడు వాటిని ఆలోచించి సమాధానాలు గుర్తించాలి.
- బుక్‌లెట్‌లో గల మూడు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాల్సిందే. అందువల్ల అవసరానికి మించిన సమయం ఒక్కో విభాగంపై వృథా చేయరాదు.
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి బెల్ కొడతారు. అది గమనించి పరీక్ష రాయాలి.
- పరీక్షకు గంట సమయం ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

18న పరీక్ష నిర్వాహకులకు శిక్షణ

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 26 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, రూట్ అధికారులకు ఈనెల 18వ తేదీన మామునూరులోని నవోదయ విద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. పారదర్శక పరీక్ష విధానం, పరిశీలన, పర్యవేక్షణ, నియమ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. పరీక్ష సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించనున్నారు.

పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

బి.పూర్ణిమ, ప్రిన్సిపాల్, మామునూరు నవదోయ విద్యాలయం



ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాల్లో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఏడు జిల్లాల పరిధిలోని మొత్తం 5,638 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట సమయం ముందే చేరుకోవాలి. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికేని హాల్ టికెట్ అందని పక్షంలో మామునూరు నవోదయ విద్యాలయంలో లేదా హెల్ప్‌లైన్ నంబరు 7780408933కు సంప్రదించాలి.

సీపీని కలిసిన ములుగు ఎస్పీ

హనుమకొండ క్రైం, జనవరి 12: ములుగు ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శబరీష్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ములుగు ఎస్పీకి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణపై కాసేపు మాట్లాడుకున్నారు.



సీపీకి పూల మొక్కను అందిస్తున్న ములుగు ఎస్పీ

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తున్న అర్చక, ఉద్యోగులు

మంగపేట, జనవరి 12: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం వద్ద ఎండోమెంట్ పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షణలో గత సెప్టెంబరు 30 నుంచి 2024 జనవరి 11 వరకు భక్తులు వేసిన కానుకలను బందోబస్తు మధ్య లెక్కించారు. మొత్తం ఏడు హుండీల ఆదాయం రూ.7,14,437 ఆదాయంతో పాటు వెండి, కొన్ని రెండు వేల నోట్లు, ఇతర మొక్కులు సమకూరాయని ఈవో శ్రవణపు సత్యనారాయణ, చైర్మన్ నూతలకంటి ముకుందం, ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ఎం.రాజశేఖరశర్మలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ, వెంకటనారాయణశర్మ, మురళీకృష్ణశర్మ, రాజీవ్ నాగశర్మ, ఉద్యోగులు సీతారాములు, సుధీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్ష

వాజేడు, జనవరి 12: లైంగిక దాడి కేసులో ముద్దాయికి ములుగు జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. 2021లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై వెంకటాపురం మండలం మహితాపురంకు చెందిన గొంది శ్రీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ శివప్రసాద్, ఎస్సై ఎస్.రాము నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.లలితశివజ్యోతి సదరు ముద్దాయికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈ కేసును అడిషనల్ పీపీ సీహెచ్.సత్యనారాయణ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ

హనుమకొండ రూరల్, జనవరి 12: సమాజంలోని అంతరాలు తొలగిపోవాలంటే విద్యనే సరైన సాధనమని, అందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండలలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బి.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందే కానీ..



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యారంగంలో సమూల మార్పుల కోసం ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 'ఉపాధ్యాయ ఉద్యమం మహిళల పాత్ర-సవాళ్లు' అనే అంశంపై అధ్యాపక జ్వాల పత్రిక సంపాదకురాలు జీకళావతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడు సమస్యల పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.సుదర్శనం, ఎ.గోవిందరావు, కె.యాకయ్య, సముద్రాల అనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, ఎం.గంగాధర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాజ్‌కుమార్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్వతాన్ని అధిరోహిస్తున్న సతీష్

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన యువకుడు

చెన్నారావుపేట, జనవరి 12: ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని ఓ యువకుడు అధిరోహించాడు. మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన ఇల్లా సతీష్ అనే యువకుడు ఆఫ్రికా దేశంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అక్కడే రాక్ క్లయింబింగ్‌ను నేర్చుకున్నాడు. ఈనెల 8న పై 5,895 మీటర్ల ఎత్తున్న కిలీమంజారో పర్వత్వాన్ని నాలుగు రోజులు శ్రమించి ఎక్కాడు. కాగా, ఈవిషయాన్ని శుక్రవారం గ్రామస్థులు తెలిపారు. ఎంతో సాహసంగా పర్వతాన్ని అధిరోహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గతంలోనూ జంగి జంప్‌లో భాగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్‌తో జంప్ చేసినట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్టును ఎక్కి బేస్ క్యాంపును అధిరోహించాడు.

గాలిపటాలు ఎగురువేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

నయీంనగర్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు, చిన్నారులకు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయకూడదని, రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టవద్దని, ఇంటి దాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు దాబాలపై వెళ్లకుండా చూడాలని, వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్రాంతి పండుగను వినియోగదారులందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి కోరారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళి

- కాళోజీ విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు ఇరువైపు నిలబడ్డ కవి అలిశెట్టి ప్రభాకర్ అని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) హనుమకొండ శాఖ అధ్యక్షుడు సాదు మహేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రజాకవి కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు టి.ఆనందాచారి, వి.రాంబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు. ప్రభాకర్ కవితలను చదివి వినిపించారు.



కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ చిత్రం ముందు నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిదులు

మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు

వరంగల్‌టౌన్, జనవరి 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాలుగురోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారంతపు సెలవు, ఆదివారం భోగి, సాధారణ సెలవు, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను పురస్కరించుకుని సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో క్రయ విక్రయాలు యథావిధిగా సాగుతాయని వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి..

ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

కాళోజీ జంక్షన్, జనవరి 12: ఉద్యోగ భద్రత లేని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వేదికగా నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ - టీఎస్ అధ్యక్షుడు రాజేష్‌ఖన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వంగపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కులాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఒక్కో కులానికి ఆర్థికంగా సహాయం చేశాయని అన్నారు. ఒక్కో కులానికి వేర్వేరు కుల వృత్తులు ఉన్నాయని వాటితోపాటు మాదిగలకు కూడా కుల వృత్తి ఉందని అన్నారు. కానీ సమాజంలో ఎంతో ఆధునికత సంతరించి వృత్తికి ఆదరణ లేక పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలను అక్కున చేర్చుకొని ఆదుకోవాలని ఆయన కోరారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ. 5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ట్యాంక్ బండ్‌పై సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ -టీఎస్ నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు ఆరెపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య, రాకేష్, సుధన్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవాల దానం

గీసుగొండ, జనవరి 12: వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి(27) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా, అతని అవయవాలను తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి దానం చేశారు. కుటుంబీకుల కథనం ప్రకారం.. శ్రీకాంతాచారి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో ఇన్సూరెన్స్ విభాగంలో పనిచేశాడు. ఏడాది కిందట అనారోగ్యానికి గురికాగా, వైద్యపరీక్షలు నిర్వహించగా బ్లడ్ క్లాటింగ్ అవుతున్నట్లు డాక్టర్‌లు గుర్తించి చికిత్స చేస్తున్నారు. తరుచూ తలనొప్పికి గురవుతుండటంతో కొద్దిరోజుల కిందట శ్రీకాంతాచారి ఇంటికి ఇక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల కిందట తలనొప్పితోపాటు మెడభాగంలో నొప్పిరావడంతో అతడిని కేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. బతికున్నప్పుడు శ్రీకాంతాచారి చెప్పిన సూచన మేరకు తల్లిదండ్రులు అతడి అదే ఆస్పత్రి(కేర్)కి అవయవాలను దానం చేశారు. శ్రీకాంతాచారి అంత్యక్రియలు సాయంత్రం గీసుగొండలో నిర్వహించారు. శ్రీకాంతాచారి తల్లిదండ్రులు బ్రహ్మచారి, సరస్వతి వడ్రంగి పనిచేస్తూ జీవిస్తుండగా, ముగ్గురు అన్నలు ఉన్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రీకాంతాచారి (ఫైల్)

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ

హనుమకొండ అర్బన్, జనవరి 12: వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంజీఎం ఓపీ బ్లాక్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఓపీని ఆర్ఎంవోలతో కలిసి ఆయన సందర్శించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ ఓపీ సమయాలే ఈ ఓపీకి వర్తిస్తాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

రేపు కైట్ ఫెస్టివల్

ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహణ

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను ఈనెల 14న సంక్రాంతి పర్వదినం రోజు నిర్వహించాలని నిర్ణయించారు. వాస్తవానికి సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం నిర్వహించాలని ముందుగా అనుకున్నప్పటికీ వీలుకాకపోవడంతో ఆదివారంరోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో జరిగే పతంగుల పండుకను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న ఈ ఉత్సవంలో పతంగుల ఎగురవేతలో ఆసక్తికలిగిన ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 12: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రాంతంలో శనివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా బాలసముద్రంలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్టలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్‌ఈసీ, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిందు కళాకారులకు ప్రోగ్రాంలను కేటాయించాలి

వడ్డెపల్లి, జనవరి 12: కళారంగాన్ని జీవనోపాధిగా మలుచుకొన్న చిందు యక్షగాన కళాకారులకు ప్రభుత్వ పథకాలను కేటాయించాలని చిందు యక్షగాన కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గజవెల్లి సారయ్య సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గజవెల్లి సారయ్య మాట్లాడుతూ.. మేడారం జాతరలో చిందు యక్షగాన కళాకారులకు ప్రోగ్రాంలు అప్పజెప్పడంతో పాటు పండుగలు, ఇతర జాతరలలో సైతం కళా ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యపర్చేందు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధ కళాకారులకు నెలకు రూ. 6వేల చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని, యువ కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నివేశన స్థలాలు మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్. జగన్‌ను సైతం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.



సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గజవెల్లి సారయ్య

ఇంజనీరింగ్ అధికారులతో కడియం భేటీ

నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష

హనుమకొండ టౌన్, జనవరి 12: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండ జడ్పీ కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ రఘువీరారెడ్డి, ఈఈ శంకరయ్యతో పాటు పలు ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయిన కడియం శ్రీహరి అభివృద్ధి పనులను సమీక్షించారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పీఎంజీఎస్‌వై, సీడీపీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడియం సూచించారు. మంజూరైన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.

ఈనెలాఖరుతో స ర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుచున్నందున చేసిన పనులను వెంటనే రి కార్డు చేయాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. కాగా, ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి జడ్పీకి వ చ్చిన కడియంకు ఇంజనీరింగ్ అధికారులు స్వాగతం పలికి సత్కరించారు.



అధికారులతో మాట్లాడుతున్న కడియం

కొత్తకొండలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు

భీమదేవరపల్లి, జనవరి 12: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. శుక్రవారం దేవాలయంలో శ్రీవీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవో రమేష్, ఎంపీడీవో భాస్కర్, ఆలయ ఈవో కిషన్‌రావులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను బట్టీ ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లు, పారిశుధ్య నిర్వాహణ, వైద్యం, విద్యుత్, రవాణా, మంచినీరు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జాతర జరిగే రోజు నుంచి చివరి వరకు తాను అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో జాతర జరుగుతుందని, 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసులు జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాతరకు వచ్చే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఏవైపు నుంచి రద్దీ ఎక్కువగా ఉంటుందో అక్కడ అధికారుల పర్యవేక్షణ ఎక్కువగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై డీపీవో జగదీష్‌తో అడిషనల్ కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో నాగరాజు, మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య మాడిశెట్టి కుమారస్వామి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టీ నిర్వాహకుడిపై కేసు నమోదు

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 12 : ఇటుక బట్టీలో బాలకార్మికుడితో పని చేయిస్తున్న నిర్వాహకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి స్టేజీ సమీపంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన గుంజె వెంకటేశ్వర్లు తన ఇటుక బట్టీలో 14 ఏళ్ల బాలుడితో పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్‌కుమార్ పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించారు.

డీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



డీసీసీ బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, జనవరి 12: సహకార బ్యాంకుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో డీసీసీ బ్యాంకు శాఖ ప్రారంభోత్సవానికి డీసీసీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అందించే హోమ్ లోన్, పర్సనల్ లోన్, గోల్డ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికిల్స్ లోన్ తదితర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గండ్ర పద్మ, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణ చందర్‌రెడ్డి, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారావు, వైస్ ఎంపీపీ అశోక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు కరెంట్‌తో కూడిన ఫెన్సింగ్ వేయవద్దు

వెంకటాపురం(నూగూరు), జనవరి 12: మండలంలోని రైతులు తమ పంట పొలాలకు కరెంటుతో కూడిన ఫెన్సింగ్ వేయవద్దని సీఐ బండారి కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో 18 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొంతమంది రైతులు తమ పంట పొలాలను అటవీ జంతువుల నుంచి రక్షించుకునేందుకు కరెంటుతో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారని, దీంతో రాత్రి వేళల్లో గమనించని రైతులు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఎవరైనా కరెంటుతో కూడిన ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని సర్పంచ్‌లు గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలని, ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఆయన కోరారు.

కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం

▸▸ అటవీశాఖ ఆధ్వర్యంలో చెత్త ఏరివేత


ఇంచర్ల ఎర్రిగట్టమ్మ పరిసరాల్లో చెత్తను ఏరివేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ములుగు, జనవరి 12: మేడారం మహా జాతర సమీపిస్తున్న తరుణంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో చెత్త ఏరివేత స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ములుగు నుంచి మేడారం వరకు 17 ప్రదేశాలలో శుక్రవారం అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తంగా 1221.50 కిలోల చెత్తను ఏరివేశారు. పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడుకోవాలని ములుగు ఎఫ్‌డీవో జోగేందర్ అన్నారు. మేడారం మహా జాతరను కాలుష్య రహితంగా జరుపుకోవాలని, భక్తులు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను తీసుకురావద్దని కోరారు. పర్యావరణంతో పాటు అటవీ జంతువులకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు.కార్యక్రమంలో ములుగు, పస్రా, లింగాల ఎఫ్‌ఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పతంగుల ఎగురవేతలో జాగ్రత్తలు పాటించాలి

▸▸ విద్యుత్ శాఖ డీఈ నాగరాజు

కాకతీయఖని, జనవరి 12:యువకులు, పిల్లలు పతంగుల ఎగురవేతలో పలు జాగ్రత్తలు పాటించాలని టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ భూపాలపల్లి డివిజన్ ఇంజనీర్ ఆపరేషన్ డి.నాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పిల్లలు, యువకులు పతంగులు ఎగురవేయడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్నచోట ఎగురవేయకూడదని సూచించారు. ఒకవేళ వాటిపై పతంగులు పడితే తీసే ప్రయత్నం కూడా చేయవద్దని అన్నారు. స్లాబ్‌లపై ఉండి ఎగురవేయకూడదని, రోడ్లపైకి వచ్చి ఎగురవేసి ప్రమాదాలకు గురికావద్దని తెలిపారు. ఆరుబయట మైదాన ప్రదేశాలకు వెళ్లి మాత్రమే ఎగురవేయాలని కోరారు. ఈవిషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఈ నాగరాజు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

▸▸ ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ


రైతు వేదికలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఏటూరునాగారం, జనవరి 12: ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల గ్రామాలను ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో పని చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. కాగా, ఎంపీడీవో కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ గ్రామలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. పంచాయతీల అధికారులకు, కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. సమావేశంలో ఐదు మండలాలలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

ఏటూరునాగారం రూరల్ : మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలను అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ తనిఖీ చేశారు. శుక్రవారం వైద్యశాలకు చేరుకున్న అడిషనల్ కలెక్టర్ ఆస్పత్రిలోని ఓపీ రూం, ల్యాబ్, ఎక్స్‌రే, తదితర విభాగాలకు చెందిన వార్డుల్లోకి వెళ్లి వైద్యసేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో జరుగుతున్న రక్త పరీక్షల వివరాలతో పాటు రోజువారీ రోగుల సంఖ్య, వారికి చేస్తున్న పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా వైద్యశాలలోని వైద్యాధికారులు, సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు హాజరుకాని వారి వివరాలతో పాటు కారణాలను ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, వైద్యాధికారులు శ్రీసాయి, మౌనిక, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహదేవపూర్ రూరల్, జనవరి 12 : మండలంలోని మహదేవపూర్, కాళేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల మెయింటనెన్స్ దృష్ట్యా ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ కటింగ్ సమయంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న ములుగులో మెగా జాబ్‌మేళా

ఏటూరునాగారం రూరల్, జనవరి 12: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 20న ములుగు జిల్లా కేంద్రంలో మెగా జాబ్‌మేళా చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో అంకిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారని, ఎంపికైన వారికి రూ.15వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలు ఉంటాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 సంవత్సరాలు కలిగిన వారు అర్హులని పీవో తెలిపారు. అర్హత ఉన్న నిరుద్యోగులు జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాల కోసం 8008932159, 7981633716 నంబర్లను సంప్రదించాలని పీవో సూచించారు.

ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

వెంకటాపూర్(రామప్ప), జనవరి 12: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో తేది. 01-04-2022 నుంచి తేది.31-03-2023 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం 15 రోజుల పాటు 23 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించింది. సోషల్ ఆడిట్‌లో వచ్చిన సమస్యలపై గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అధికారులు సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆడిట్‌లో వచ్చిన వాటిని చదివి వినిపించగా మొత్తం ఖర్చు రూ.5,10,48,554లపై తనిఖీ చేయగా ప్రజా వేదికలో అధికారులు రూ.2,71,379ల ఉపాధి హామీ పథకం, ఫారెస్ట్ సిబ్బందిపై రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగపద్మజ, సోషల్ ఆడిట్ వింగ్ ఇన్‌చార్జి రాజశేఖర్, అంబుడ్స్‌మెన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌ఆర్పీ నర్సయ్య, ఏపీవోలు అంకూస్, సునీత, సోషల్ ఆడిట్ ఎస్‌టీఎం వేణు, డీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

కాటారం, జనవరి 12: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో శనివారం నుంచి ఈ నెల 16 వరకు పత్తి కొనుగోళ్లు జరగవని ఏఎంసీ చైర్‌పర్సన్ పెండ్యాల మమతమనోహర్, మార్కెట్ కార్యదర్శి లా షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నాలుగు రోజులు పత్తి కొనుగోళ్లు ఉండవన్నారు. సీసీఐ సెంటర్‌లో యథావిధిగా 17వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

భూపాలపల్లిటౌన్, జనవరి 12: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పెండెం మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా కూచనపల్లి రవీందర్, ఆడిట్ కన్వీనర్ పరమ్‌సింగ్, గౌరవ అధ్యక్షుడిగా అజ్మీర అనిల్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షురాలిగా రమాదేవి, అనిల్, సమ్మయ్య, సతీష్, ఉపాధ్యక్షులుగా శారద, సమ్మయ్య, బాలరాజు, రాజు, కార్యదర్శులుగా రజిత, సురేందర్, సురేష్, కోమల, మొగిలి, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా రఘుకుమార్, శంకర్, రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు. అలాగే టీఆర్‌టీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం డీఈవో రామ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఆర్‌టీఎఫ్ ముందుంటుందని తెలిపారు.

మేడారం అభివృద్ధి పనులపై హైకోర్టులో కేసు

తాడ్వాయి, జనవరి 12: వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ నుంచి జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి పనులను నిలిపివేయాలని పేర్కొంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ కేసు వేశామని గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు ఇంజనీరింగ్ అధికారులకు డబ్బులు ఇచ్చి స్థానిక ఆదివాసీలకు పనులు దక్కకుండా మోసం చేస్తున్నారని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో హైకోర్టు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, వివిధ శాఖల అధికారులకు పనులు నిలిపివేయాలని నోటీస్ జారీ చేసిందని అన్నారు. పనులు నిలిపివేయనట్లయితే ఆయా శాఖల అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని, హైకోర్టు నోటీస్‌కు లోబడి ఉండాలని ఆయన తెలిపారు.

వనదేవతల సన్నిధిలో క్యాలెండర్ ఆవిష్కరణ

మేడారం, జనవరి 12 : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెర రమేష్ ఆధ్వర్యంలో తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ దేవతల సన్నిధిలో 2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి ప్రమోషన్ ఇచ్చే విధంగా సంఘం కృషి చేస్తుందని అన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం జరిగేందుకు సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బ రవి, జిల్లా బాధ్యులు వాసం సారంగపాణి, నాయకులు ఎట్టి సారయ్య, ఊకే పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో టెంట్ సిటీ ఏర్పాటు

మేడారం, జనవరి 12 : తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల వసతికి ప్రైవేటు టెంటెడ్ అకామిడేషన్ శుక్రవారం ప్రారంభం అయ్యాయి. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఈ టెంట్ సిటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా జాతరకు సమయం దగ్గర పడుతుందని అన్నారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. వరద ముంపుతో అతిథి గృహాలు ధ్వంసం అయ్యాయని, భక్తులకు వసతికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టెంట్ సిటీ కొంత మేరకు వసతిని కల్పిస్తుందని, భక్తులు ఉపయోగించుకునేలా తక్కువ ధరతో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

ఆదివాసీ ఇలవేల్పుల వడ్డెల సమావేశం

మేడారం, జనవరి 12 : తెలంగాణ కుంభమేళాగా పిలుకునే మేడారం మహా జాతరలో ఆదివాసీ ఇలవేల్పుల సమ్మేళనం జరుగుతుంది. ఈ నేపథ్యంలో వడ్డెలు, ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో శుక్రవారం సమావేశం అయ్యారు. పీసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవి అధ్వర్యంలో ఆదివాసీల ఇలవేల్పుల సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు మ్యూజియం ఆవరణంలో ఈ సమ్మేళనం జరుగనుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆదివాసీ ఇలవేల్పులను సమ్మేళనంలో ఒక్కచోట చేర్చి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. సమావేశంలో చందా వీరయ్య, నాగుల శ్రీరాములు, కుల పెద్దలు పాల్గొన్నారు.

యాసంగిలో డీబీఎం-38 కాలువపై ఆధారపడొద్దు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 12: ఎస్సారెస్పీ స్టేజ్-1 డీబీఎం-38 కాలువ చివరి ఆయకట్టుకు వేసవిలో సాగునీరు అందించలేక పోతున్నామని ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంసాగర్, లోయర్ మానేరు డ్యాంలల్లో తగినంత నీటి లభ్యత లేక అందించేకలేక పోతున్నామని, రైతులెవరూ కాలువపై ఆధారపడి యాసంగి సాగు చేసుకోవద్దని అన్నారు. బోరుబావులు, బావి ఇతర నీటి వనరులు ఉంటేనే ఆరుతడి పంటలు వేసుకోవాలని ఎస్‌ఈ కోరారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

▸▸ కలెక్టర్ భవేష్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 12: గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల్లో విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కరోనా దృష్ట్యా గ్రౌండ్‌లో ప్రతి ఒక్కరికి థర్మల్ స్క్రీనింగ్ చేయాలన్నారు. శానిటైజర్‌లను అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సందేశాలతో కూడిన శకటాలను ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్ నాయక్ పాల్గొన్నారు.

ప్రతీ శాఖ జిల్లా అధికారి హాజరు కావాలి

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ఫారెస్ట్ సెక్షన్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గణపురం, జనవరి 12 : మండల సర్వసభ్య సమావేశానికి ప్రతీ జిల్లా శాఖ అధికారి హాజరు కావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కావటి రజిత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు నేరుగా జిల్లా ఆయా శాఖల అధికారులు విన్నప్పుడే పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. ఆయా శాఖల అధికారులు శాఖాపరమైన నివేదికలను చదివి వినిపించారు. సభకు హాజరుకాని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి మరోమారు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మైలారం గుట్టల భూమిని జిల్లా కార్యాలయాలకు కేటాయించాలని చర్చించారు. ఓపెన్ కాస్ట్-3 సమీపంలో ఉన్న సుద్దకుంట చెరువు అన్యాక్రాంతానికి గురైందని ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని తహసీల్దార్ మురళీదర్‌రావును కోరారు. అంతేకాకుండా చెరువు శిఖాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయకట్టు రోడ్లు కూడా మరమ్మత్తులు చేస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నీరందించాలన్నారు. ఏమైన ప్రజా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. గణపురం అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకతీకంగా ప్రజల సమస్యలు తీరుస్తూ అభివృద్ధికి పాటుపడతానని దీనికి అందరూ సహకరించాలన్నారు. అంతేకాకుండా చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి జెన్‌కో అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గండ్ర పద్మ, తహసీల్దార్ మురళీదర్‌రావు, ఎంపీడీవో అరుంధతి, వైస్ ఎంపీపీ అశోక్, పీఏసీఎస్ చైర్మన్‌లు గండ్ర సత్యనారాయణరెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, కోఆప్షన్ సభ్యుడు చోటేమియా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పోట్ల నగేష్, సర్పంచులు, విజయ, మమత, మంజుల, కుమారస్వామి, ఆగంరావు, రవి, ఎంపీటీసీలు శివశంకర్, అశోక్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అప్రెంటిస్‌షిప్ మేళా

కాకతీయఖని, జనవరి 12: నిరుద్యోగ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ యువతకు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అప్రెంటిస్‌షిప్ మేళాను బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్ ట్రైనింగ్ చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, ప్రభావిత ప్రాంతాల యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం జీఎం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 12 : వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చల్ల రాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. అటవీ జంతువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అటవీ జంతువులను వేటాడేందుకు మండలంలో కొంతమంది అడవుల్లో ఉచ్చులు పెడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇప్పటికైనా వేటగాళ్లు తమ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. ఎవరైనా అటవీ జంతువులను వేటాడేందుకు ప్రయత్నిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సభకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 12: మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని పాలక మండలి సభ్యులు పట్టుబట్టారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెరుకూరి సతీష్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదని, హాజరు కాని వారిపై చర్యలకు తీర్మానం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని రైతు వేదికల్లో రైతులకు పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని, రైతులకు అందుబాటులో ఉండాలని జడ్పీటీసీ పాయం రమణ సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయకపోవడంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీడీపీవో శిరీష మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 66 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అడ్డూరి బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సభ

▸▸ ప్రధాన సమస్యలపై ప్రస్తావించని సభ్యులు

ఏటూరునాగారం, జనవరి 12 : ఏటూరునాగారం మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ అంతటి విజయ అధ్యక్షతన జరిగింది. పలు శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంతో సీట్లన్నీ ఖాళీగా దర్శనం ఇచ్చాయి. సభ్యులు సైతం మనకెందుకులే అన్న చందంగా వ్యవహరించారు. ముందుగా వ్యవసాయ శాఖపై ఏవో వేణుగోపాల్ రెండు ముచ్చట్లతో ప్రస్తావన ముగించారు. విద్య, వైద్యం, ఉపాధి హామీ, రోడ్లు, వవ్యసాయం, తదితర సమస్యలు మేజర్ గ్రామపంచాయతీలో కొండెక్కినప్పటికి సర్పంచులు, ఎంపీటీసీలు నోరు మెదపకపోవడం పట్ల పలువురు నివ్వరపోయారు. సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ.వలీయాబీ, ఎంపీడీవో కుమార్, సూపరింటెండెంట్ ఉమారాణి, రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యురాలు సరిత, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు వితరణ

ఏటూరునాగారం,జనవరి 12: ఏటూరునాగారంలో రామజన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో స్థానిక రామాలయం కమిటీ నిర్వాహకులు, ఆలయ అర్చకులు శోభయాత్ర నిర్వహించారు. శుక్రవారం ప్రతి ఇంటికి అక్షింతలను పంపిణీ చేశారు. అనంతరం ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌కు ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు అకింతలను అందజేశారు.

జీపీల నూతన భవనాలు ప్రారంభం

రేగొండ, జనవరి 12 : మండలంలోని జగ్గయ్యపేట, నాగుర్లపల్లి, గూడెపల్లి గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన గ్రామపంచాయతీల నూతన భవనాలు శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రారంభించి మాట్లాడారు. జగ్గయ్యపేట గ్రామపంచాయతీకి ప్రహరీ గోడ నిర్మాణం, జగ్గయ్యపేట నుంచి బుగులోని జాతర వరకు బీటీ రోడ్డు నిర్మాణాలు మంజురయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే పరకాల నుంచి ములుగుకు బస్సు సర్వీసు గురించి ఎమ్మెల్యేను ప్రజలు అడగగా వెంటనే ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బస్సు సర్వీసు ప్రారంభించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో డీపీవో ఆశాలత, ఎంపీపీ పున్నం లక్ష్మి, జడ్పీటీసీ సాయిని విజయ, సర్పంచులు తిరుపతి, పాతుపల్లి సంతోష్, లింగంపల్లి ప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు నాయినేని సంపత్‌రావు గుంటోజు క్రిష్ణయ్య, వీరబ్రహ్మం, ఎడ్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

గోవిందరావుపేట తహసీల్దార్‌గా సృజన్‌కుమార్

గోవిందరావుపేట, జనవరి 12 : గోవిందరావుపేట నూతన తహసీల్దార్‌గా సృజన్ కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏటూరునాగారం తహసీల్దార్‌గా పనిచేస్తున్న సృజన్‌కుమార్ మండలానికి బదిలీ కాగా, ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్ ములుగు ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. 2022 మే నెల నుంచి రాజ్‌కుమార్ మండలంలో విధులు నిర్వర్తించి మంచి గుర్తింపు తెచ్చుకుని ప్రజల మన్ననలు పొందారు.

హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య

▸▸ మృతురాలు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కుమార్తె

▸▸ తేలని కారణాలు.. ఎన్నో అనుమానాలు..


రాథోడ్ దీప్తి (ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 12: హనుమకొండ జిల్లాలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి (20) అనే విద్యార్థిని గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దీప్తి బీఎస్సీ(అగ్రికల్చర్) సెకండ్ ఇయర్ చదువుతోంది. తండ్రి మోతీలాల్‌నాయక్ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. అందులో కొన్ని సబ్జెక్ట్‌ల్లో దీప్తి ఫెయిల్ అయింది. అప్పటి నుంచి కొంత మనస్తాపంతో వున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో దీప్తి గదిలో ఉండే తోటి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దీప్తి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో అనుమానంతో సిబ్బంది తలుపులు తెరిచి చూడగా, ఉరివేసుకుని కనిపించింది. కళాశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే దీప్తి ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. పరీక్షల్లో ఫెయిల్ కావడం వల్ల అఘాయిత్యానికి ఒడిగట్టిందా? లేక మరే కారణాలేమైనా ఉన్నాయా? అనేది సస్పెన్సుగా మారింది. ఈ కోణాల్లోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళాశాల యజమాన్యం నిర్లక్ష్యంతోనే తనకూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి మోతీలాల్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి..

దీప్తి ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, కన్నం అనిల్, విజయ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విచ్చలవిడిగా గుడుంబా విక్రయాలు

▸▸ టీఎంఎం జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు

మంగపేట, జనవరి 12: మండలంలోని గ్రామాల్లో గుడుంబా విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని రాజుపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాజుపేట పరిసర గ్రామాల్లో గుడుంబా అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయన్నారు. పక్కనే గల పినపాక జిల్లా నుంచి మండలంలోని బ్రాహ్మణపల్లి మీదుగా గుడుంబాను ద్విచక్ర వాహనాలపై తరలించి గ్రామాల్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలు గుడుంబాను తాగి తీవ్ర అనారోగ్యాల బారిన పడి పలువురు మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. రోజు కూలి పనికి వెళ్తేనే పూట గడిచే కుటుంబంలో గుడుంబాకు బానిసలుగా మారి డబ్బులు ఖర్చు చేస్తూ ప్రాణాలు కూడా పోగొట్టుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సీజనల్ వ్యాధులతో హాస్పిటల్ పాలై మరోవైపు గుడుంబా బారిన పడి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు మాత్రమే ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారని, గుడుంబా అమ్మకాలు వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయా.. అనే అనుమానం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడుంబా అమ్మకాలను నిరోధించాలని ఆయన కోరారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చిట్యాల, జనవరి 12 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని శాంతినగర్ శివారు ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో నాలుగు రోజుల పాటు సీసీఐ పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కనకశేఖర్, సీసీఐ అధికారి పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 16 వరకు పత్తి సరుకును కొనుగోలు కేంద్రానికి తీసుకురావద్దని రైతులకు సూచించారు. ఈ నెల 17న బుధవారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.